జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 2 | జులై | 2026 • పేజీలు : 6

## గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్
- డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు సన్మానం



**చర్ల, జూలై 01:(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎం హెచ్‌వో) డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం చర్ల మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రులలో నిర్వహిస్తున్న వైద్య సేవలు, రికార్డులు, పరిపాలనా విధానాలను క్షుణ్ణంగా

మిగతా 2 లో...

- జిల్లాలో ఈగల్ బృందం భారీ గంజాయి పట్టివేత
- రూ.2.95 కోట్ల విలువైన 581 కిలోల గంజాయి స్వాధీనం
- వారం రోజుల నిఘాతో ఈగల్ బృందం ఆపరేషన్?
- జిల్లా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం
- ఇది సమన్వయ లోపమా..? లేక ఉద్దేశ పూర్వక గోప్యతా..?
- ఐటీసీ ప్రాంగణంలోకి కంటైనర్ ఎలా చేరింది..?
- కంటైనర్‌ను ఈగల్ బృందమే లోపలికి తీసుకెళ్లిందా..? లేక ముందుగానే ప్రాంగణంలోకి ప్రవేశించిందా..?
- గణాంకాల్లోనూ మార్పులు.. ఆపరేషన్ తీరుపై పలు సందేహాలు
- పూర్తి వివరాల కోసం అధికారిక వివరణపై ఎదురుచూపులు



### భద్రాద్రిలో...

6 లో..

# ఈగల్ భారీ ఆపరేషన్..!

### జిల్లా పోలీసులకు సమాచారం ఉందా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో రాష్ట్ర స్థాయి ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఫోర్స్ చేపట్టిన భారీ గంజాయి పట్టివేత రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న కంటైనర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో దాచిన 581 కిలోల గంజాయిని ఈగల్ ఫోర్స్ మంగళవారం స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.2.95 కోట్లుగా బుదువారం బుర్గంపాడ్ పోలిస్ అధికారులు అధికారికంగా వెల్లడించారు. అయితే జిల్లా లో ఇంత పెద్ద భారి ఆపరేషన్ జరిగిన ఇక్కడి ఇన్నత పోలిస్ అధికారులకు ముందస్తూ సమాచారమే లేదని విశ్వసనీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. దీంతో గంజాయి పట్టివేత కంటే ఈ ఆపరేషన్ నిర్వహించిన తీరు ఇప్పుడు పోలీసు వర్గాలతో పాటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్ మద్దినేని మురళి

**చర్ల, జూలై 01:(ప్రజాజ్యోతి):** చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ ఎస్ ను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించి, నాణ్యత, పరిశుభ్రతపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో త్రాగునీటి సమస్యపై సంబంధిత ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్య




# దర్జాగా బహుళ అంతస్తుల నిర్మాణాలు..!

2 లో..

• అనుమతులు జీ ప్లస్-2 వరకే... • నిర్మాణాలు మాత్రం జీ ప్లస్-5 వరకా..? • ఆర్టీఐతో వెలుగులోకి వచ్చిన ఆసక్తికర వాస్తవాలు... • అధికారుల మౌనంపై అనుమానాలు..? • జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారా! • ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా బహుళ భవనాల నిర్మాణాలు • పూర్తిస్థాయిలో ప్రక్షాళన తప్పనిసరి • మధ్యతరగతి వారికోక రూల్... బడా వ్యక్తులకు మరొక రూలా! • ఇదెక్కడి న్యాయం అంటున్న సామాన్యులు • చర్యలు చేపట్టి బహుళ నిర్మాణాలకు కళ్లెం వేయాలని డిమాండ్ • అధికారులు ఎలా స్పందించేనో!

## గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి





(మొదటి పేజీ తరువాయి...)

పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు.డాక్టర్స్ డే సందర్భంగా కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారికతో పాటు డాక్టర్లు పూజ, సుశీల, ఉమ ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్లు లను డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ శాలువాతో సన్మానించి అభినందించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఆయన, గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి ఇంటింటి సర్వేలు చేపట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే ప్రభుత్వ హాస్టళ్లను తరచుగా సందర్శించి విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్యపరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వారికి అందిస్తున్న వైద్య సేవలు, రిఫరల్ విధానం తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి హైరిస్క్ కేసును సకాలంలో గుర్తించి తగిన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించిన డీఎంహెచ్‌వో, వైద్య సిబ్బంది పనితీరును అభినందిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



(మొదటి పేజీ తరువాయి...)



పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.బియ్యం సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# దర్జాగా బహుళ అంతస్తుల నిర్మాణాలు..!

- అనుమతులు జీ ప్లస్-2 వరకే... • నిర్మాణాలు మాత్రం జీ ప్లస్-5 వరకా..? • ఆర్టీఐతో వెలుగులోకి వచ్చిన ఆసక్తికర వాస్తవాలు... • అధికారుల మౌనంపై అనుమానాలు..? • జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారా! • ఒకరిని చూసి మరొకరు పోటాపోటీగా బహుళ భవనాల నిర్మాణాలు • పూర్తిస్థాయిలో ప్రక్షాళన తప్పనిసరి • మధ్యతరగతి వారికోక రూల్... బడా వ్యక్తులకు మరొక రూలా! • ఇదెక్కడి న్యాయం అంటున్న సామాన్యులు • చర్యలు చేపట్టి బహుళ నిర్మాణాలకు కళ్లెం వేయాలని డిమాండ్ • అధికారులు ఎలా స్పందించేనో!

**ఇల్లందు, జులై 1, (ప్రజా జ్యోతి)**

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాల వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం గ్రౌండ్ ప్లస్–2 (జీ+2) వరకు మాత్రమే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తుంది. పట్టణంలో పలుచోట్ల జీ ప్లస్ 4, జీ ప్లస్ 5 వరకు భవనాలు నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి అధికారుల పనితీరుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఆర్టీఐ ద్వారా లభించిన సమాచారం ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో జీ ప్లస్ 2 కంటే ఎక్కువ అంతస్తులకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలుస్తుంది. అయితే పట్టణంలోని ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాలు, కాలనీల్లో అనేక బహుళ అంతస్తుల భవనాలు జీ ప్లస్ 4, జీ ప్లస్ 5 వరకు నిర్మించబడి ఇప్పటికే వినియోగంలో ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో అసలు ఈ నిర్మాణాలు ఏ అనుమతులతో జరిగాయి? నిర్మాణ దశలో అధికారులు తనిఖీలు నిర్వహించలేదా? లేక ఉల్లంఘనలను చూసీ చూడనట్లు వ్యవహరించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› ఆర్టీఐతో వెలుగులోకి వచ్చిన అంశాలు

సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన వివరాల్లో జీ ప్లస్ 2 కంటే ఎక్కువగా నిర్మాణాలు చేపట్టిన భవనాల వివరాలు, అందుకు తగిన ఆధారాలు సమర్పించాలని కోరగా జి ప్లస్ 2 కన్న ఎక్కువ భవన నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాచారం ఇవ్వడం విశేషం. అనుమతుల కంటే ఎక్కువ అంతస్తులు నిర్మించడం పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధమైతే, అలాంటి నిర్మాణాలపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయంపై కూడా స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తుంది. పైగా అనుమతులు లేకపోవడం వల్ల డబుల్ టాక్స్ పెనాల్టీ విధించి చేతులు దులుపుకుంటున్నారనే ఆపవాదు లేకపోలేదు..

### ››› నిర్మాణాలు పూర్తయ్యే వరకు చూస్తున్నారా?

అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. అయితే అనేక భవనాలు పునాదుల నుంచి పై అంతస్తుల వరకు నిర్మాణం పూర్తిచేసుకుని వినియోగంలోకి వచ్చినా, అధికారుల నుంచి కఠిన చర్యలు కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల కేవలం జరిమానాలు విధించడం, నోటీసులు ఇవ్వడం ద్వారా బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. కానీ సామాన్య వ్యక్తులు చిన్న ఇంటి నిర్మాణం చేపడితేనే అనుమతులు లేవని ఆ ఇంటి నిర్మాణ పనులు నిలిపివేయడంతో పాటు కొన్నిచోట్ల నిర్మాణ సామాగ్రిని పట్టుకుపోవడం జరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు..

### ››› ఒక అక్రమం... మరెన్నో నిర్మాణాలకు దారి..?

ఇల్లందు మున్సిపల్ పరిధిలో పరిమితికి మించి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై చర్యలు తీసుకోకపోవడంతో అదే తరహాలో మరికొందరు కూడా అదనపు అంతస్తుల నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నారని ప్రజలు చెబుతున్నారు. దీంతో పట్టణంలో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు క్రమంగా పెరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇది మరింత పెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతుంది.

### ››› సామాన్యులకు ఒక న్యాయం... బడా వారికి మరో న్యాయమా..?

మున్సిపల్ పరిధిలో చిన్న ఇంటి నిర్మాణంలో స్వల్ప ఉల్లంఘన జరిగినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు మాత్రం భారీ వాణిజ్య భవనాలు లేదా బహుళ అంతస్తుల నిర్మాణాల విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలకు ఒక విధానం, ప్రభావశీలులకు మరో విధానం అమలవుతుందనే భావన ప్రజల్లో పెరుగుతుందని స్థానికులు అంటున్నారు.

### ››› ప్రత్యేక సర్వే నిర్వహించాలన్న డిమాండ్

మున్సిపల్ పరిధిలో ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకున్న అన్ని బహుళ అంతస్తుల భవనాలపై ప్రత్యేక సర్వే నిర్వహించి, అనుమతులు, నిర్మాణ ప్రణాళికలు, అదనపు అంతస్తుల వివరాలు, ఆక్యుపెన్సీ అనుమతులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి బహుళ భవనాల నిర్మాణాలకు అవకాశం కల్పిస్తే భవిష్యత్తులో పార్కింగ్, అగ్నిమాపక భద్రత, డ్రైనేజీ, మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఆర్టీఐలో వెల్లడైన వివరాలను పరిశీలించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని, అక్రమ నిర్మాణాలకు కళ్లెం వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



## అనుమతులు లేని భవనాలకు 100 శాతం వీసి పెనాల్టీ: ఎస్ సందీప్, కమిషనర్, ఇల్లందు మున్సిపాలిటీ



అనుమతులు లేని భవనాలకు 100 శాతం వీసి పెనాల్టీ విధించడం జరుగుతుంది. మున్సిపాలిటీలో ఓనర్ షిప్, భవన నిర్మాణ ప్లాన్ సరిగ్గా లేని వాటికీ అనుమతి ఇవ్వం. టి పాస్ లో భవన నిర్మాణ అనుమతుల కోసం అప్లై చేస్తే ఓనర్ షిప్ సర్టిఫికెట్ లేనందున తిరస్కరించడం జరుగుతుంది. భవన నిర్మాణం అనుమతులతో సక్రమంగా కడితేనే ఆక్యుపెన్సి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. ప్రతి భవన నిర్మాణ అనంతరం తప్పని సరిగా ఆక్యుపెన్సి సర్టిఫికెట్ తీసుకోవాలి. భవన నిర్మాణంలో అనుమతులు లేకుండా కట్టడాలు చేస్తే టాక్స్ డబుల్ పెనాల్టీ విధిస్తాం. ఇంక్రోచ్మెంట్ వాటికి నోటీసులు ఇవ్వడం జరుగుతుంది.

# మండల వైద్యాధికారి డా. వెంకటేష్‌కు సత్కారం




**టేకులపల్లి, జూలై 01,ప్రజాజ్యోతి:** వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ భద్రాద్రి కొత్తగూడెం మిలీనియం డిస్ట్రిక్ట్ 320ఈ,లయన్స్ క్లబ్ టేకులపల్లి ఆధ్వర్యంలో సులానగర్ ప్రభుత్వ వైద్యశాల,మండల వైద్యాధికారి డా. కంచర్ల వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో విలువైనవని కొనియాడా రు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు చూపుతున్న అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు.వైద్య వృత్తి మానవ సేవకు ప్రతీక అని, ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.అనంతరం డా. కంచర్ల వెంకటేష్‌కు శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరిం చారు.అనంతరం ఆయన స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధోతి బాబురావు, కార్యదర్శి పగడాల నాగేశ్వరరావు, కోశాధికారి బిట్టు గోవర్ధన్ రావు, జేబీ మోహన్, ఆర్.శాంతయ్య, జి. రాజయ్య, బొక్క శ్రీనివాసరావు, మండల నాగేశ్వరరావు, టేకులపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, కేదారేశ్వర రావు, బోడ పుణ్యా నాయక్, బ్రహ్మచారి, కేసా వేణుగోపాల్, తోటకూరి సందీప్, ఆరోగ్య విస్తరణ అధికారి పున్నమయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, సూపర్వైజర్ దనసరి రాంబాబు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆయుర్వేద వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కోయగూడెం ఓసీలో జేఏసీ నిరసన

- యాజమాన్యానికి డిమాండ్ల మెమోరాండం



**టేకులపల్లి, జూలై 01ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియాలోని టేకులపల్లి మండల కోయగూడెం ఓపెన్ కాస్ట్ (కేఓసీ)లో నాలుగు జాతీయ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేఓసీ మేనేజర్ పేరాల శ్రీనివాస్ కు అందజేశారు.ఈ సందర్భంగా ఎఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఐఎన్ టీయూసీ నాయకుడు గుగులోత్ బాషు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్ ల వల్ల శాశ్వత ఉద్యోగ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. సమ్మె హక్కు, ట్రేడ్ యూనియన్ హక్కులు, వేతన సవరణ వంటి కార్మిక హక్కులు బలహీనపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.2026 జూన్ 30తో 11వ వేతన ఒప్పందం గడువు ముగిసినా ఇప్పటివరకు 12వ వేతన కమిటీని ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే 12వ వేతన కమిటీని ఏర్పాటు చేసి, కొత్త వేతన ఒప్పందాన్ని అమలు చేసి బొగ్గు గని కార్మికులకు నూతన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ,ఐఎన్ టీయూసీ, సీఐటీయూ,హెచ్ ఎంఎస్ సంఘాల నాయకులు,కార్మికులు గుగులోత్ బాషు, కొంగర వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్,ఆర్. శ్రీనివాస్, రాచకొండ రాజయ్య,వెంకట నర్సయ్య,వినయ్ బాబు, జంపయ్య, అహ్మద్,దల్ సింగ్, మసూద్ అలీ,కనకరాజు, హతీరామ్ పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణాలకు రూ.25 వేల విరాలు





**టేకులపల్లి,జూలై 01,ప్రజాజ్యోతి:** గ్రామాభివృద్ధి,ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్– ఉమా దంపతులు కోయగూడెం గ్రామపంచాయతీ,లచ్చగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలో ఆలయ నిర్మాణాలకు మొత్తం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు.గంగా పురం గ్రామంలో నిర్మించనున్న హనుమాన్ ఆలయానికి తమ వంతు సహాయంగా రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. అలాగే లచ్చగూడెం గ్రామ పంచాయతీలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించి భక్తి భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్న కోరం సురేందర్– ఉమా దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వారి సేవా దృక్పథం ఆదర్శప్రాయమని, ఇలాంటి సహకారం గ్రామాల్లో ఆధ్యాత్మిక,సామాజిక అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్,లచ్చగూడెం సర్పంచ్ అడళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు సర్దార్,గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైద్యులకు ఘన సన్మానం

- ఏజెన్సీలో వైద్యుల సేవలు అభినందనీయం
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు



**చర్ల, జూలై 01(ప్రజాజ్యోతి):** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ సీ లో బుధవారం వైద్యులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు సమాజానికి అపారమైన సేవలు అందిస్తున్నారని వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ పేద ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న వైద్యుల అంకితభావం అభినందనీయమని కొనియాడారు.ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల ఆధునిక వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన మందుల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు చూపిన సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించే ప్రతి రోగికి ఆప్యాయతతో కూడిన మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వానికి, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని వైద్యులను కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది పరిటాల సంతోష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## టేకులపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరం

- రాజకీయ పార్టీలతో తహసిల్దార్ సమావేశం
- 85.29 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి



**టేకులపల్లి,జూలై01,ప్రజాజ్యోతి:** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు.మండలం లోని 45 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 42,558 మంది ఓటర్లు ఉండగా, జూలై 1నాటికి 36,298 మందికి (85.29 శాతం) ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన ఓటర్లకు కూడా ఫారాల పంపిణీ కార్యక్రమా న్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బుధవా రం తహసిల్దార్ వీరభద్రం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణను కేవలం బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) మాత్రమే చేపట్టాలని, ఈ ప్రక్రియలో బీఎల్ఏలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన సూచించారు.ప్రతి రాజకీయ పార్టీ ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక బీఎల్ఏను నియమించి, వారికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు అందజేయాలని కోరారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, మృతి చెందిన వారి పేర్ల తొలగింపు లేదా ఇతర అభ్యంతరాల పరిష్కారానికి ఫారం–7ను వినియోగించాలని తహసిల్దార్ వివరించారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు నింపే సమయంలో బీఎల్ఓలు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీకి గండి కొట్టే వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య



**ములకలపల్లి, జూలై 1 (ప్రజాజ్యోతి):** ఉపాధి హామీ పథకానికి భంగం కలిగించే వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. పూసుగూడెం గ్రామ పంచాయితీ ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాలపై 40 శాతం నిధుల భారం మోపే ఈ చట్టం వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు తగ్గి వలసలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని దినాలను 200 రోజులకు పెంచడంతో పాటు రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని, పని ప్రదేశాల్లో మజ్జిగ ప్యాకెట్లు, టెంట్లు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరీ నాగేశ్వరరావు, మాలోతు రావూజీ, నిమ్మల మధు, పోడియం వెంకటేశ్వర్లు, అమల, కీసరి వెంకట్రావు, వర్సా శ్రీరాములు, సున్నం శ్రీను, గుగులోతు దేవేందర్, రవీందర్, రాఘవయ్య, బుగ్గా వెంకటనరసమ్మ, గడ్డం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన



**చర్ల, జూలై 01(ప్రజాజ్యోతి):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, వీబీజీ రామ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ బుధవారం చర్ల మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా చర్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, పంచాయతీ ఈవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బందెల చంటి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. 2005లో అమల్లోకి వచ్చిన ఉపాధి హామీ చట్టం లక్షలాది పేద కుటుంబాలకు ఉపాధి కల్పించిందని ప్రస్తుతం తీసుకొస్తున్న వీబీజీ రామ్ విధానం వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని అన్నారు. ఉపాధి హామీ పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించ కుండా రాష్ట్రాలపై అదనపు భారం మోపుతోందని విమర్శించారు. కార్మికులకు పూర్తి స్థాయిలో పనిదినాలు కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలను 15 రోజుల్లో చెల్లించాలని, ప్రతి వారం పే స్లిప్‌లు అందించాలని, పనిస్థలాల్లో టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే రెండు ఫోటోల నిబంధనను రద్దు చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని రూ.600కు పెంచడంతో పాటు ఏడాదికి 200 రోజుల ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నల్లగట్ల నరసింహామూర్తి, శ్యామల వెంకటేశ్వర్లు, లాలయ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## సింగరేణి వైద్యశాలలో సమస్యలు పరిష్కరించండి




**ఇల్లందు, జులై 1 (ప్రజా జ్యోతి)** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని వైద్యశాలలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఐఎన్టియుసి ఆధ్వర్యంలో సింగరేణి సీఎమ్ఓ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ను కోరారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టేకులపల్లి డిస్పెన్సరీలో 24 గంటలు వైద్యుడు, మూడు షిఫ్ట్ లో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండేలా చూడాలని కోరారు. అదేవిధంగా ఇల్లందు జెకె డిస్పెన్సరీలో పూర్తిస్థాయి వైద్యుడుని నియమించాలని, ఇల్లందు ఏరియా వైద్యశాలలో డిజిటల్ ఎక్స్ రే ను ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన సీఎమ్ఓ సమస్యలను త్వరితగదని పరిష్కరిస్తానని తెలిపినట్లు జె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అనంతరం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సీఎమ్ఓ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు, కెఓసి పిట్ సెక్రటరీ కోసూరి సత్యనారాయణ, నాయకుడు కలవల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటర్ల విద్యుత్ వైర్ల చోరీ

- పంటలకు నీరందక రైతుల ఆవేదన
- పాత సూరారం సమీపంలో మోటర్ల వైర్ల చోరీతో రైతులకు తీవ్ర నష్టం
- కిన్నెరసాని వాగు పరివాహక ప్రాంతంలో దొంగల బీభత్సం. వ్యవసాయ మోటర్ల వైర్లు మాయం



**పాల్వంచ, జూలై 1, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని పాత సూరారం గ్రామ సమీపంలోని కిన్నెరసాని పరివాహక వాగు వద్ద రైతులు వ్యవసాయ సాగు కోసం ఏర్పాటు చేసుకున్న మోటర్ల విద్యుత్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన కలకలం రేపింది.బాధిత రైతులు మెస్సు రాములు, తాటి మల్లేష్, జక్కుల సత్యంలకు చెందిన మోటర్ల విద్యుత్ వైర్లు దొంగిలించబడినట్లు తెలిపారు. దీంతో పంటలకు నీరందించే ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి, సాగు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే ప్రాంతంలో గతంలో కూడా పలుమార్లు ఇలాంటి చోరీలు జరిగినప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలపై జరుగుతున్న వరుస చోరీలతో రైతులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చోరీలకు పాల్పడుతున్న దుండగులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ ప్రాంతాల్లో రాత్రివేళ గస్తీని పెంచి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.. మా వ్యవసాయ భూములకు నీరందించేందుకు ఏర్పాటు చేసుకున్న మోటర్ల విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే చోరీ చేశారు. దీంతో పంటలకు నీరు అందించే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొత్త వైర్లు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలంటే వేల రూపాయల ఖర్చు అవుతోంది. ఇప్పటికే వ్యవసాయ వ్యయాలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ చోరీలు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి.ఇదే ప్రాంతంలో గతంలో కూడా పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు. పోలీసులు రాత్రివేళ ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి, చోరీలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. రైతుల ఆస్తులకు రక్షణ కల్పించి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను కోరుతున్నాం.

## అంగన్వాడీటీచర్స్ కి అప్పగించిన బూత్ లెవెల్ ఆఫీసర్ విధులను తొలగించాలి

- మండల తహసిల్దార్ కి వినతి పత్రం అందజేసిన అంగన్వాడీ టీచర్స్



**అశ్వాపురం, జులై 1, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని మండల ఎమ్మార్వో ఆఫీసులో అంగన్వాడి టీచర్లకు అప్పగించిన బి ఎల్ ఓ( బూత్ లెవెల్ ఆఫీసర్) విధులను తొలగించి అంగన్వాడి సేవలకు మాత్రమే పరిమితం చేయాలని కోరుతూ తహసిల్దార్ సూర్యప్రకాష్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ మాట్లాడుతూ అంగన్వాడీసెంటర్లలో హెల్పర్స్ లేక టీచర్స్ హెల్పర్ పని చేయడం జరుగుతుంది. ప్రభుత్వం అప్పగించిన అంగన్వాడి కేంద్రం నిర్వహణ, పిల్లల పౌష్టిక ఆహారం, స్కూల్, విద్య, ఆరోగ్య సేవలు పూర్తి బాధ్యతతో నిర్వర్తిస్తున్నాం. అదనంగా బి ఎల్ వో విధులను కేటాయించడం వలన అంగన్వాడి కేంద్రాల నిర్వహణకు, తీవ్ర ఆటంకం కలుగుతుందని, ఇంటింటి సర్వేలు, ఓటరు నమోదు పనుల వల్ల అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలను సరిగా సక్రమంగా చూసుకోలేకపోతున్నామని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న స్థాయి అధికారులు అంగనవాడి టీచర్లపై ఉంచిన బిఎల్ఓ బాధ్యతను తొలగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంకా మా పైనే ఉన్నాయని మాపై దయవుంచి బిఎల్ఓ బాధ్యతలను తొలగించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటీచర్స్ రెడ్డి అరుణ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హంసవేణి, నాగమణి. . సాహితి. కరుణ. . సుశీల. రత్నకుమారి. దీప్తి, లత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదినాన్ని వేడుకలు

- కేక్ కట్ చేసి తాటి వెంకటేశ్వర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు

**అన్నపురెడ్డిపల్లి, జూలై 1 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాటి వెంకటేశ్వర్ల జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. తాటి వెంకటేశ్వర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రమేష్, పెంట్లం సర్పంచ్ కారం శివ, పానుగంటి రాఘవులు, సుగ్గల నరసింహారావు, లాకావత్ వెంకటేశ్వర్లు, బానోత్ నాగరాజు, సన్నేపల్లి సుధాకర్, ఇనపనూరి ఆజిమ్, చేరుకూరి రవి, పెద్దరపు నాగరాజు, ఇనపనూరి రాంబాబు, చల్లా పుల్లయ్య, ఇటుకల సత్యం, ఇటుకల హరి, భూక్యా రాంబాబు, పర్స మాధవ, షరబద్దీన్, రూంజా శ్రీను, కొండేటి వెంకన్న, యాసరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తా

- డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల
- కొత్తగూడెం డివిజన్ మహాసభలో ఎమ్మెల్యే కూనం నేనితో పాటు పాల్గొన్న కొత్వాల
- జర్నలిస్టుల మహాసభలో పాత్రికేయులను సన్మానించిన కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 1,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం నియోజకవర్గంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాల్వంచ బి.సి.ఎం రోడ్ లోని ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ టి.యు.డబ్ల్యు.జె కొత్తగూడెం డివిజన్ మహాసభలో కొత్తవల పాల్గొని పాత్రికేయలను ఉద్దేశించి మాట్లాడారు, తానెప్పుడూ జర్నలిస్టులకు సన్నిహితంగా ఉంటానన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని కొత్వాల అన్నారు. అనంతరం పలువురు పాత్రికేయులను కొత్వాల ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు కొత్తగూడెం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, 46వ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్షి , కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, వై.వెంకటేశ్వరరావు బూసి శ్రీను, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# 'ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు' నినాదంతో పోరుబాట

- పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసే వరకు ఉద్యమం ఆగదు
- ఇండ్లు కూల్చివేత చర్యలను పేదలపక్షాన ప్రతి ఘటిస్తాం
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో స్థలాలు క్రమ బద్ధీకరించి హక్కు కల్పించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు






**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 1 (ప్రజా జ్యోతి)**

ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోరుబాట, లక్ష్యం నెరవేరేవరకు ఆగబోదని, పేదలకు గూడు కల్పించేవరకు పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ, సిపిఎం, న్యూ డిమోక్రసీ, మాస్ లైన్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కూనంనేని ప్రజనుద్దేశించి మాట్లాడారు. నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసేవరకు వామపక్షాల ఆధ్వర్యంలో సాగే ఈ ప్రజా ఉద్యమం కొనసాగిస్తామన్నారు ,కొత్తగూడెం పట్టణ పరిధిలో జీవో నెంబర్ 76 ను తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేసి, అర్హులైన నిరుపేదలందరికీ పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాల్వంచ పరిధిలోని జీవో నెంబర్లు 444, 999, 817, 727, 410 పరిధిలో దశాబ్దాలుగా నమ్ముకుని ఉన్న స్థలాలను తక్షణమే రెగ్యులరైజ్ చేసి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం సాయిబాబు మాట్లాడుతూ పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇండ్ల కూల్చివేత చర్యలను తక్షణమే మానుకోవాలని, ప్రభుత్వ నిరంకుశ కూల్చివేతలను పేద ప్రజలందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇండ్ల స్థలాలను తక్షణమే క్రమబద్ధీకరించి వారికి చట్టబద్ధమైన హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే ఇంటి నెంబర్లు జారీ చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని డిమాండ్ చేశారు.న్యూ డిమోక్రసీ జిల్లా నాయకులూ గౌని నాగేశ్వరరావు, మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్లను, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, మున్నాలక్ష్మీకుమారి, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, రాహుల్, ఫహీమ్, ఎం జ్యోతి, లిక్కి బాలరాజు, బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, ఎం సతీష్, కుంజా కృష్ణ, పెద్దబోయిన సతీష్, ప్రభాకర్, భాస్కర్, వీరభద్రం, శివ, కార్పొరేటర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలు



**ములకలపల్లి, జూలై 1 (ప్రజాజ్యోతి):** బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి తాటి వెంకటేశ్వర్లు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో పని చేస్తూ అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేసిన తాటి వెంకటేశ్వర్లు గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తుర్రం శ్రీనివాస్, భూక్య ధర్మ, మాజీ సర్పంచులు బైటి రాజేష్, వాడే నాగరాజు, గడ్డం భవానినాథన్, ఉపసర్పంచ్ వాడే నర్సింహారావు, అలాగే కుంజా అర్జున్, వర్స చరణ్, నగపాటి సీతారాములు, బండి కొమురయ్య, కొండవీటి రాజారావు, ఎలమంచిలి సునీల్, గడ్డం ఉదయ్, పెనుబల్లి ప్రసాద్, మడకం రమేష్, టి.వి. నాగేశ్వరరావు, రింగు బాలు, మోట సునీల్, సోను, పి. సన్నీ, రాయపూడి నమిత్, వివేక్, తాటి రవి, మహేష్, ఊకే అశోక్, సోడే స్వరాజు, సోడే శ్రీనివాసు, బొర్రా సుధాకర్, అజ్మీరా నాగరాజు, భూక్య రవి, సోయం దుర్గాప్రసాద్, అజ్మీరా లక్ష్మా, దుబ్బ రామకృష్ణ, సడియం ఉదయ్, కొండ్రు అజిత్, సడియం సాయికిరణ్, సడియం ప్రవీణ్, కాకా నాగేంద్ర, సడియం కళ్యాణ్, యాల్లోబోయిన నవీన్, కోర్సా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అధ్వానంగా పారిశుద్ధ్యం..

# దోమల పెరుగుదలకు సైడ్ కాలువలే కారణం

- పరిశుద్ధ పనుల్లో నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?
- హరిజనవాడ డ్రైనేజీ వ్యవస్థను వెంటనే బాగు చేయాలని గ్రామస్థుల డిమాండ్
- స్వచ్ఛ భారత్ నినాదం కాగితాలకే పరిమితమా..?
- వర్షాకాలం వస్తుందని ముందే తెలిసినా ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టలేదు..?
- పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్న అధికారులు ఎక్కడ..?
- దోమల నివారణ మందుల పిచికారీ ఎప్పుడు చేశారు..? రికార్డుల్లోనే పరిమితమైందా..?
- వ్యాధులు ప్రబలిన తర్వాతే యంత్రాంగం మేల్కొంటుందా..?
- ప్రజల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే ముఖ్యమా..?










**టేకులపల్లి, జూలై 1,ప్రజాజ్యోతి:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో టేకులపల్లి మండలంలోని హరిజనవాడతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడ్ కాలువలు పూడికతో నిండిపోవడం, మురుగునీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు కనిపిస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరు నిల్వ ఉండటం, చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా హరిజనవాడలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో మురుగు నీరు ఇళ్ల ముందే నిలిచి చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పరిస్థితిని పరిశీలించిన దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం "స్వచ్ఛ భారత్–స్వచ్ఛ గ్రామం" పేరుతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, దోమల నివారణ చర్యలు సక్రమంగా అమలు కావడం లేదని వారు చెబుతున్నారు.వర్షాకాలం ప్రతి ఏడాది వస్తుందని తెలిసినా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదు? కాలువలను చివరిసారిగా ఎప్పుడు శుభ్రం చేశారు? దోమల నివారణ కోసం ఫాగింగ్, మందుల పిచికారీ ఎప్పుడు నిర్వహించారు?గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎన్ని సార్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు? ప్రజలు అనారోగ్యానికి గురైన తర్వాతే స్పందిస్తారా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి హరిజనవాడ డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించడం, సైడ్ కాలువలను పూర్తిగా శుభ్రపరచడం, చెత్త తొలగింపు, దోమల నివారణ మందుల పిచికారీ చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టకపోతే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

- జిల్లాలో ఈగల్ బృందం భారీ గంజాయి పట్టివేత
- రూ.2.95 కోట్ల విలువైన 581 కిలోల గంజాయి స్వాధీనం
- వారం రోజుల నిఘాతో ఈగల్ బృందం ఆపరేషన్?
- జిల్లా పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం
- ఇది సమన్వయ లోపమా..? లేక ఉద్దేశ పూర్వక గోప్యతా..?
- ఐటీసీ ప్రాంగణంలోకి కంటైనర్ ఎలా చేరింది..?
- కంటైనర్‌ను ఈగల్ బృందమే లోపలికి తీసుకెళ్లిందా..? లేక ముందుగానే ప్రాంగణంలోకి ప్రవేశించిందా..?
- గణాంకాల్లోనూ మార్పులు.. ఆపరేషన్ తీరుపై పలు సందేహాలు
- పూర్తి వివరాల కోసం అధికారిక వివరణపై ఎదురుచూపులు



## భద్రాద్రిలో...

# ఈగల్ భారీ ఆపరేషన్..!

## జిల్లా పోలీసులకు సమాచారం ఉందా?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో రాష్ట్ర స్థాయి ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఫోర్స్ చేపట్టిన భారీ గంజాయి పట్టివేత రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న కంటైనర్‌లో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిలో దాచిన 581 కిలోల గంజాయిని ఈగల్ ఫోర్స్ మంగళవారం స్వాధీనం చేసుకుంది. దీని విలువ సుమారు రూ.2.95 కోట్లుగా బుధువారం బుర్గంపాడ్ పోలీస్ అధికారులు అధికారికంగా వెల్లడించారు. అయితే జిల్లాలో ఇంత పెద్ద భారీ ఆపరేషన్ జరిగిన ఇక్కడి ఇన్నత పోలిస్ అధికారులకు ముందస్తూ సమాచారమే లేదని విశ్వసనీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. దీంతో గంజాయి పట్టివేత కంటే ఈ ఆపరేషన్ నిర్వహించిన తీరు ఇప్పుడు పోలీసు వర్గాలతో పాటు ప్రజల్లోనూ చర్చనీయాంశంగా మారింది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### సోషల్ మీడియాలో మొదటిగా..!

మొదటిగా సోషల్ మీడియాలో ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఒడిశా నుంచి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్న కంటైనర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహస్య గదిలో దాచిన 525 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.65 కోట్లుగా అంచనా వేశారు. మాదకద్రవ్యాన్ని తరలిస్తున్న కంటైనర్‌ను గుర్తించిన ఈగల్ బృందం వ్యూహాత్మకంగా నిఘా కొనసాగించి చివరకు సారపాకలో పట్టుకున్నట్లు మంగళవారం నాడే వెల్లడించింది. దింత్ పాటు ఆ సమయంలో కేవలం ఈగల్ టీం సభ్యులు మాత్రమే ఉన్న ఓ వీడియోను విడుదల చేశారు. అందులో సంభంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది ఒక్కరే ఉన్నారు. ఇంత భారి ఆపరేషన్ లో జిల్లాకు సంభందించిన పోలీస్ శాఖ అధికారులు గానీ, సిబ్బంది గానీ లేరు. దీంతో ఈ ఆపరేషన్ కొత్త చర్చకు దారితీసింది.

### వారం రోజుల నిఘా..?

అయితే ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ రవాణాపై ఈగల్ ఫోర్స్‌కు వారం రోజుల ముందే విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచే కంటైనర్ కదలికలపై రహస్యంగా నిఘా కొనసాగించి, సరైన సమయంలో ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం. అందుకే ఈగల్ విడుదల చేసిన వీడియోల్లో మొత్తం వారి బృందం సభ్యులు మాత్రమే కనిపించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ ఆపరేషన్ పూర్తయ్యే వరకు జిల్లా పోలీసు యంత్రాంగానికి ముందస్తు సమాచారం అందలేదనే ప్రచారం పోలీసు వర్గాల్లో వినిపిస్తోంది. దాడులు పూర్తయిన తర్వాతే జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు విషయం తెలిసిందనే చర్చ సాగుతోంది. దీంతో రాష్ట్ర స్థాయి ప్రత్యేక బృందం జిల్లా పరిధిలో ఇంత పెద్ద ఆపరేషన్ నిర్వహించినా స్థానిక పోలీసు యంత్రాంగానికి సమాచారం అందలేదా? ఒకవేళ అందకపోతే అందుకు కారణాలేమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై సంబంధిత డివిజన్, పోలీస్ స్టేషన్ స్థాయి అధికారులను సంప్రదిస్తే భిన్నమైన సమాధానాలు వినిపిస్తున్నాయి. కొందరు తమకు ముందస్తు సమాచారం లేదని చెబుతుండగా, మరికొందరు సంయుక్త ఆపరేషన్ అని పేర్కొంటున్నారు. దీనిపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత రాలేదు.

### ఐటీసీ ప్రాంగణంలోనే ఎందుకు ఆపరేషన్..?

ఈ ఘటనలో మరో కీలక అంశం ఐటీసీ పేపర్‌బోర్డ్స్ ప్రాంగణం. ఈగల్ టీం విడుదల చేసిన వీడియోల ప్రకారం కంటైనర్ సంస్థ వెస్ట్ గేట్ ద్వారా లోపలికి వెళ్లి పార్కింగ్ ప్రాంతంలో నిలిపినట్లు కనిపిస్తోంది. అయితే కంటైనర్‌ను ఈగల్ ఫోర్స్ వెంబడిస్తూ సంస్థలోకి తీసుకెళ్లిందా? వారం రోజులుగా నిఘా కొనసాగించినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో జాతీయ రహదారిపైనే కంటైనర్‌ను అడ్డుకునే అవకాశం లేదా? వ్యూహాత్మక కారణాలతోనే ఐటీసీ ప్రాంగణం వరకు అనుసరించారా? లేక అది ముందుగానే సంస్థ ప్రాంగణంలోకి ప్రవేశించిన తర్వాత అక్కడే స్వాధీనం చేసుకుందా? అనే అంశంపై స్పష్టత లేదు.

వాస్తవానికి ఐటీసీ వంటి భారీ పారిశ్రామిక సంస్థల్లో భద్రతా నిబంధనలు అత్యంత కఠినంగా అమలవుతాయి. ప్రతి వాహనం ప్రవేశానికి గేట్ అనుమతి, నమోదు, భద్రతా తనిఖీలు తప్పనిసరిగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో ఈ కంటైనర్ ఎప్పుడు లోపలికి ప్రవేశించింది? ప్రవేశానికి అనుమతి ఎవరు ఇచ్చారు? గేట్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.



### స్పష్టత ఇవ్వాల్సిన అంశాలు ఎన్నో...?

ఈగల్ ఫోర్స్‌కు సమాచారం ఎప్పుడు అందింది? స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చారా? ఇవ్వకపోతే ఎందుకు? ఐటీసీ ప్రాంగణంలోకి కంటైనర్ ఎలా ప్రవేశించింది? పంచనామా కోసం అక్కడికి తరలించారా? లేక అక్కడే గుర్తించి స్వాధీనం చేసుకున్నారా? ఆపరేషన్ పూర్తయ్యే వరకు స్థానిక పోలీసులను దూరంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలున్నాయా? అనే అంశాలపై అధికారిక వివరణ రావాల్సి ఉంది.వీటితో పాటు ఇందులో మరో గమనార్హమైన విషయం ఏమిటంటే, మంగళవారం ఈగల్ ఫోర్స్ సోషల్ మీడియాలో విడుదల చేసిన వివరాల్లో 525 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు, వాటి విలువ రూ. 2.65 కోట్లుగా పేర్కొంది. అయితే బుధవారం బూర్గంపాడు పోలీసులు నిర్వహించిన అధికారిక విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయి పరిమాణం 581 కిలోలు, విలువ 2.95 కోట్లుగా ప్రకటించారు. ఒక్కరోజు వ్యవధిలో స్వాధీనం పరిమాణంలో 56 కిలోల వ్యత్యాసం ఎలా వచ్చింది? మిగిలిన గంజాయి ఎక్కడి నుంచి లభించింది? లేక తొలి సమాచారం ప్రాథమిక అంచనా మాత్రమేనా? అనే అంశాలపై కూడా అధికారిక స్పష్టత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రశ్నలు ఐటీసీ పేపర్‌బోర్డ్ సంస్థపై గానీ, జిల్లా పోలీసు శాఖపై గానీ ఆరోపణలు కావు. భారీ గంజాయి పట్టివేతకు సంబంధించిన ఆపరేషన్ ఎలా జరిగింది అనే అంశంపై పూర్తి వాస్తవాలు వెలుగులోకి రావాలనే ఉద్దేశంతో తలెత్తుతున్న ప్రజా ప్రయోజన ప్రశ్నలు మాత్రమే. సారపాకలో జరిగిన ఈ భారీ గంజాయి పట్టివేత పోలీసు శాఖ సాధించిన విజయమే అయినప్పటికీ.. ఆపరేషన్ అమలు తీరు, జిల్లా పోలీసులతో సమన్వయం, ఐటీసీ ప్రాంగణంలో చర్యలు చేపట్టడానికి గల కారణాలపై ఈగల్ ఫోర్స్, జిల్లా పోలీసు శాఖ, సంబంధిత వర్గాలు అధికారికంగా వివరణ ఇస్తేనే అన్ని సందేహాలకు తెరపడే అవకాశం ఉంది